# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కువైట్ దేశ అత్యున్నత గౌరవమైన "ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్" ని ఆ దేశ ప్రభుత్వం ప్రదానం చేసింది.
2. రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
3. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.
4. చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.
5. భారత మాజీ ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు వర్ధంతి ఈరోజు.

=========================

కువైట్ దేశంలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆ దేశ అత్యున్నత గౌరవమైన "ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్"ని కువైట్ ప్రభుత్వం ప్రదానం చేసింది. కువైట్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న ఆ దేశ ప్రధాన మంత్రి షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాజకీయ, వాణిజ్య, ఇంధన, రక్షణ, భద్రత, ఆరోగ్యం, విద్య, సాంకేతికత సాంస్కృతిక భాగస్వామ్యాలపై ఇరు దేశాల నేతలు చర్చించారు. రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సమావేశంలో ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. కువైట్ ప్రధానమంత్రి షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాను భారత దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానించారు.

ఇదిలా ఉండగా కువైట్ లోని ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ., ప్రవాస భారతీయుల మూలంగా భారత దేశం నేడు ప్రపంచంలో కీలక భూమిక పోషిస్తోందని పేర్కొన్నారు.

కాగా.. ఈరోజు రోజ్‌గార్ మేళాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విభాగాలు, సంస్థలలో కొత్తగా నియమితులైన వారికి దృశ్యమాధ్యమం ద్వారా నాయామక పత్రాలను ప్రధానమంత్రి పంపిణి చేస్తారు.

-------------------------

రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైయస్సార్ జిల్లా కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును అధికారులతో

కలిసి మంత్రి నిన్న రామానాయుడు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాయిస్... 30 సెకన్లు

---------------------------

సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలను చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతిగృహ సముదాయానికి స్థానిక శాసన సభ్యులు దామచర్ల జనార్దన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ, ఉన్నత విద్య అభ్యసించే పేద విద్యార్థుల అందరికి ఉపయోగపడేలా వసతిగృహాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు.

---------------------------

ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందుబాటులోకి తెస్తూ సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 300 పైగా ఆరోగ్య ఉప కేంద్రాలు, 170 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామీణ మారుమూల ప్రాంతాలతో పాటు..ఆదివాసీ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్... 30 సెకన్లు

---------------------------

చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. వైయస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా పర్యాటక శాఖ అధికారులతో కలిసి సిద్ధవటం కోటను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్య విధానంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. సిద్ధవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలుగు రాష్ట్రాల్లోని కాజీపేట– కొండపల్లి రైల్వే సెక్షన్ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో భాగంగా పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 25 నుంచి జనవరి 9 వరకు పలు రైళ్లను నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. కాజీపేట– డోర్నకల్– కాజీపేట, డోర్నకల్– విజయవాడ–డోర్నకల్, విజయవాడ–భద్రాచలం రోడ్డు, మార్గాల్లో ప్రయాణించే మెము రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఈనెల 28, 29, జనవరి 2,5,7,8,9 తేదీల్లో గుంటూరు– సికింద్రాబాద్–గుంటూరు ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ నిలిపివేశామని చెప్పారు. అలాగే ఈనెల 27, జనవరి 1,4,7,8,9 తేదీల్లో విజయవాడ – సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్ ప్రెస్ ను కూడా రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

---------------------------

భారత మాజీ ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు వర్ధంతి ఈరోజు. 1921 జూన్ 28వ తేదీన తెలంగాణలోని నర్సంపేటలో జన్మించిన ఆయన... న్యాయవాద విద్యనభ్యసించారు. అనంతరం, స్వాతంత్రోద్యమం,

తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర ప్రభుత్వంలో పలు కీలక పదవులు నిర్వహించిన నరసింహారావు... 1991వ సంవత్సరంలో దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 1996 వరకు కొనసాగారు. ఆయన హయాంలో పలు ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. సాహిత్య రంగానికి సేవ చేయడమే కాకుండా బహుబాషా కోవిదుడిగా సుపరిచితులు. పీవీ నరసింహారావు 2014వ సంవత్సరం డిసెంబరు 23వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ఎన్డీయే కూటమి ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురంలో పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన ఉద్యోగ మేళా కార్యక్రమంలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని తెలంగాణ రహదారుల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్ లో నిన్న మంత్రి మాట్లాడుతూ, సంధ్య థియేటర్ ఘటనను రాజకీయం చేయొద్దని కోరారు. నటుడు అల్లు అర్జున్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఇక నుండి తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవని, త్వరలోనే చలన చిత్ర పరిశ్రమ పెద్దలతో సమావేశమై చర్చిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

వినియోగదారుల హక్కులపై అవగాహనా కల్పించే లక్ష్యంతో రేపు దేశవ్యాప్తంగా జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా జాగో గ్రాహక్ జాగో యాప్, జాగృతి యాప్, జాగృతి డ్యాష్ బోర్డులను ప్రారంభించనుంది. జాగో గ్రాహక్ జాగో యాప్ వినియోగదారుడి ఆన్ లైన్ కార్యకలాపాల సమయంలో మోసాలు లేకుండా అవగాహన కలిగిస్తుందని వినియోగదారుల వ్యవహారాల శాఖ తెలిపింది.

---------------------------

సైబర్ నేరాల వల్ల నగదు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న కమిషనరేట్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. డయల్ 100కి వస్తున్న ఫిర్యాదులపై స్పందన పెరిగిందన్నారు. శబ్ధ కాలుష్యంపై తాము తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు వస్తోందని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 45 శాతం ఎఫ్ఐఆర్‌లు పెరిగినట్లు వివరించారు

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా తీరాల వైపు పయనిస్తుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు నుంచి గురువారం వరకు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సముద్రంలో గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించింది.

తెలంగాణలోనూ ఈ రోజు నుంచి పలుచోట్ల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

=====================